కవిత

# మూగ గళము



పి.శ్రీదేవి

ఈ బ్రతుకు కావ్యమున
ఎవరెరుంగని కవిత
విరచించి నా వేల
విధీ! వివరింపుమా!
ఉదయ సంధ్యా నవ్య
రోచిస్సులను కాంచి
హృదయ మంబుజ మటుల
ఉత్ఫుల్ల మగువేళ
వాసంత సౌభాగ్య
విస్ఫార మల్లికా
సౌగంధములు వీచి
సురుచిర భ్రాంతి గొలుప
శారద శర్వరీ ప్ర
శాంత విశాల వాటి
మలయ పవనాల కౌ
గిలిలోన మేనెల్ల
పులకలెత్తిన వేళ
నా హృదయ సీమలో
నడయాడు మృదుమధుర
భావనా వీచికలు
పరుగులెత్తుచు గొంతు
ముడి వరకు చేరినవి
వడిలేక యడగినవి
సడిలేక యడరినవి
తడిలేక యారినవి
సడిలేని అలల వలె
నడయాడి తరలినవి
వడితగ్గు తరగలటు
కదలాడి మరలినవి
మరలినవి తరలినవి
మరల నా హృదిలోకె
పలుకెరుంగని తలపు
లలముకొని నా గళము
లో లయమొంది ఒదిగి
విలపించునే గాని
ఒకయింత పలుకైన
పెకలించుకొని రాదు.

ఈ హృదయ వీణియను
విదళించినా వేల
వీణా నినాదమును
వెలికి రానీయకనె!
తీగలే సడలినవొ
తెగినవో ముడివడెనొ
తరచి చూడగ రాద!
సరి చేయగా రాద!
ఈ మూగ గళములో
చిక్కుకొనె నొక్కటే
ఒక ఆశ, నినుగూర్చి
ఒక పాట పాడగా
ఒక కోర్కె నామాట
పాటగా గొంతెత్తి
పాడగా నాగొంతు
సవరింతు—నినుతలచి
సన్నగా జాలిగా
ఎల్గెత్తి వేడగా
నాయాశ ననలెత్త
నాగొంతు సవరింప,
వేయి గొంతుల మ్రోత
వినవచ్చి నటులగును
వెరపించి నటులగును
సెలయేటి గుండెలో
సుడుల సవ్వడు లటుల,
కడలి కడుపున దాగు
బడబాలనం బటుల
రోదనా నేకశ్రుతు
లొరసి వగచెంది నా
లోననే గుమురుకొని
లోలోన దురపిల్లు.
నే పలుక మొదలిడిన
కినుక నందెదవేమొ,
అలుక చెందెదవేమొ
నా పలుకు వినబడిన.
నీకు విందగు నేమొ
నేను కుందుట స్వామి!

నీకు భయమగు నేమొ
నాకు పలుకులు నేర్ప!
నీ వొనర్చిన కీడు
నే నెరిగి కసిదీర
నిన్ను దూరుదు ననుచు!
నిజము చెప్పెద వినుము
నిన్ను తిట్టుటకైన
నాకు గిట్టదు సామి!
అర్భకుడ నోయి! నిను
దుర్భాషలాడగా
దర్పమెటు కలుగు! నీ
కర్పితంబైన ఈ
దీన హృదయమున, నీ
వైన యూహాలే, నీ
కైన పలుకులే, నీ
పైన కూర్పులే, నా
వైన మాటలుగ, నా
లోన పాటగా నడ
యాడి మూల్గినవి. కడు
నార్తి నొందినవి. ముడి
విడని గొంతులో తడ
బడుచు మరి మరీ యే
డ్చినవి. కడివెడై యే
డ్చినవి-పాటలో ప్రతి
పదం బొక నదముగా
ప్రవహింప, పదములో
నాదమే సంద్రమై
పొంగి నింగికి ప్రాక,
కడివెడై యేడ్చినవి
కడునార్తి నొందినవి.
కనలేవ! అంతరం
గములోన రగిలి భుగ
భుగ మనుచు పొనలెగయు
భగ్నవాంఛ! వినరా
ద, వినబడద, వినదగ
ద, విడలేని కంఠమున
చెలగి కలగిన శోక
మలసి వ్రాసిన గీతి.
రచియించి నా నహో
రాత్రములు, నినుగూర్చి,
రసభావ భరితముగ,
రాగలయ బద్ధముగ,
ఒకే యొకటగుపాట,
ఒకే యొక పరిపాట,
పాడుచున్నానోయి
పాట నేనే యగుచు
బ్రతుకులో బరువైన
ప్రతియొక్క నిముసమును
పాటలో కూర్చుచును
పాడుచున్నానోయి
పాట నేనే యగుచు
నా మూగ గొంతులో
నలిగి కుమిలెడు పాట
కదలింప లేద నీ
బధిర హృదయము స్వామి!
కరగింపలేద నీ
కరకుటెడదను సామి!

---

మానవుడికి ఉండవలసిన ఉత్తమలక్షణాల్లో ధైర్యం మొట్టమొదటిది; ఎందువల్లనంటే ధైర్యాన్ని ఆధారంచేసుకొనే మిగతాలక్షణాలన్నీ అలవడతాయి.

—విన్స్టన్ చర్చిల్.

నిండుగా జీవించాలంటే బ్రతుకులో చాలా అడ్డంకులు ఎదుర్కోవలసి ఉంటుంది. ఈ అడ్డంకులకు భయపడి ఎక్కువ గోడలు నిర్మించుకుంటూ పోతే వాటి మధ్యనే బంధింపబడి పోయి చివరికి జీవితానికే దూరమైపోతాం.

—కెనెత్ యస్. డేవిస్